



PRGI NO : TGTEL /25/A0438

# స్టార్ త్రినేత్రం

అనుక్షణం అక్షరసత్యం | తెలుగు దినపత్రిక




వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 279 | ఎడిటర్ : డీ.శివకృష్ణ | శనివారం, 28-3-2026 | పేజీలు: 4 | వెల: 2
WARANGAL VOL-1 ISSUE-279 Editor: D.SHIVAKRIHSNA SATURDAY, 28-3-2026 Pages: 4 Price: 2
Publised From Warangal: Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar & TG All Districts

## సిర్సపల్లి డంపింగ్ యార్డు రద్దు అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తా..

### మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ



**స్టార్ త్రినేత్రం, హుజూరాబాద్ :**

హుజూరాబాద్ మండలంలోని సిర్సపల్లి – రంగాపూర్ శివారులో ప్రతిపాదించిన డంపింగ్ యార్డును రద్దు చేయాలనే డిమాండ్‌పై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, తగిన నిర్ణయం తీసుకుంటామని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. శుక్రవారం ఇల్లంతకుంట శ్రీ సీతారాముల స్వామి దేవస్థానానికి వెళ్తున్న మంత్రి, హుజూరాబాద్ అఖిలపక్ష నాయకుల విజ్ఞప్తి మేరకు కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కమిటీ నాయకులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.

▶ మిగతా 2లో

## దేశంలో లాక్‌డౌన్ విధిస్తారా..?

**స్టార్ త్రినేత్రం, జాతీయం :**




దేశంలో ఇంధన కొరత కారణంగా లాక్‌డౌన్ విధిస్తారంటూ సోషల్ మీడియాలో, కొన్ని వార్తా సంస్థల్లో విపరీతమైన ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారానికి కేంద్ర ప్రభుత్వం తెరదించింది. కేంద్ర పెట్రోలియం మరియు సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి ఈ వార్తలను తీవ్రంగా ఖండిస్తూ ట్వీట్ చేసారు. ప్రస్తుత అంతర్జాతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో చమురు సరఫరాపై ఆందోళనలు ఉన్నప్పటికీ, దేశంలో లాక్‌డౌన్ విధించే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా స్పందిస్తూ.. ప్రజలు ఇలాంటి నిరాధారమైన వార్తలను నమ్మవద్దని, ఇవన్నీ కేవలం అవాస్తవాలని కొట్టిపారేశారు. దేశంలో తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా గొలుసులో ఎటువంటి ఆటంకాలు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆయన భరోసా ఇచ్చారు.
ఈ సందర్భంగా కేంద్రమంత్రి ప్రజలకు ఒక కీలక విన్నపం చేశారు. అనవసరమైన భయాందోళనలకు లోనై పెట్రోల్ బంకుల వద్ద క్యూలు కట్టవద్దని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ప్రభుత్వం ఎలాంటి సంక్షోభాన్ని ఎదుర్కోవడానికైనా సిద్ధంగా ఉందని, ముందస్తు వ్యూహాలతో చమురు నిల్వలను పర్యవేక్షిస్తున్నామని ఆయన ప్రకటించారు. భారత్ తన ఇంధన అవసరాల కోసం వివిధ దేశాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, ఎక్కడా కొరత ఏర్పడకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

## తీన్మార్ మల్లన్న పాదయాత్ర ప్రకటన

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**



తెలంగాణ రాజకీయాల్లో తనదైన శైలిలో దూసుకుపోతున్న తీన్మార్ మల్లన్న, రాష్ట్ర రాజకీయాల్లో మరో సంచలనానికి తెరలేపారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా భారీ పాదయాత్ర చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ యాత్ర వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం బీసీలకు, వెనుకబడిన తరగతులు రాజ్యాధికారం కల్పించడమేనని అన్నారు. ఇప్పటికే దీనికి సంబంధించి మల్లన్న పార్టీ 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ' (TRP) వర్గాలు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. బీసీల సామాజిక న్యాయం, రాజకీయ హక్కులు, వారిని అధికారంలో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ఈ సుదీర్ఘ ప్రయాణం సాగనుంది.
ఈ పాదయాత్ర కేవలం ఒక ప్రదర్శన మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో వెనుకబడిన వర్గాల బలోపేతానికి ఒక వేదికగా నిలవనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గ్రామగ్రామాన పర్యటించి, బీసీల సమస్యలను వినడమే కాకుండా, వారి రాజకీయ సాధికారతకు అవసరమైన మద్దతును కూడగట్టనున్నారు. ఇప్పటికే రూట్ మ్యాప్ సిద్ధమైనందున, ఏ జిల్లా నుండి యాత్ర ప్రారంభమవుతుంది, ఏయే దశల్లో సాగుతుంది అనే వివరాలు త్వరలోనే అధికారికంగా వెల్లడి కానున్నాయి.

## ఘనంగా జగధబిరాముడి కల్యాణం..

### పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి దంపతులు



**స్టార్ త్రినేత్రం, భద్రాద్రి కొత్తగూడెం:**

భద్రాద్రిలో శ్రీ సీతారాములవారి కల్యాణోత్సవం కన్నుల పండువగా, అంగరంగ వైభవంగా జరిగింది. వేదమంత్రోచ్చారణ నడుమ సాగిన రాములోరి కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు భారీగా హాజరయ్యారు. ఆద్యంతం శ్రీరామ నామంతో భద్రగిరి మారుమ్రోగింది. మిథిలా స్టేడియం వైకుంఠాన్ని తలపించగా... ప్రత్యేకంగా అలంకరించిన శిల్పకళా శోభితమైన కళ్యాణ మండపంలో నిర్వహించిన రామయ్య కళ్యాణం చూసి భక్తులు భక్తి పారవస్యంతో పులకించిపోయారు.
కాగా.. సీఎం రేవంత్ రెడ్డి సతీసమేతంగా భద్రాద్రికి విచ్చేశారు. స్వామివారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ దంపతులు, దేవాదాయశాఖ మంత్రి కొండాసురేఖ సీఎం వెంట వచ్చారు. అనంతరం మండపంలోని భక్తులకు దేవస్థానం పండితులు కల్యాణ ప్రాసస్త్యంను వివరించారు. తొలుత భద్రాచలంలో రూ.351 కోట్ల అభివృద్ధిపనులకు సీఎం, మంత్రులు శంకుస్థాపన చేశారు. భద్రాద్రి రామాలయాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించి రామయ్యకు అభిముఖంగా సీతమ్మ వారిని ఆసీనులను చేశారు. ప్రవరణ, మోక్షబంధనం, యజ్ఞోపవీతం, వర పూజ, స్వామి వారికి ప్రత్యేక అలంకారాలు నిర్వహించి మధుపర్కాలు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తరామదాసు చేయించిన పచ్చల పతకం వరుడైన రామయ్యకు, చింతాకు పతకం వధువు సీతమ్మకు,శ్రీరామమాడను లక్ష్మణ స్వామికి అలంకరింపజేశారు. సరిగ్గా 12 గంటలకు భక్తుల జయ జయ ధ్వానాల మధ్య అభిజిత్ లగ్నంలో వధూవరుల శిరస్సుపై జీలకర్ర బెల్లం ఉంచారు.

## ఎక్సైజ్ సుంకం భారీగా తగ్గింపు.. పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గుతాయా?

**స్టార్ త్రినేత్రం, జాతీయం :**




అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ , డీజిల్ పై విధిస్తున్న ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గించింది. పెట్రోల్‌పై లీటరుకు ఎక్సైజ్ సుంకాన్ని రూ.13 నుంచి రూ.3కు, డీజిల్‌పై లీటరుకు ఉన్న రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా తొలగించారు. ఈ క్రమంలో వినియోగదారుల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతాయని అన్న సందేహాలు మొదలయ్యాయి. అయితే, ఎక్సైజ్ సుంకం తగ్గించినప్పటికీ, పెట్రోల్ బంకుల్లో ధరలు వెంటనే భారీగా తగ్గే అవకాశం తక్కువని నిపుణులు భావిస్తున్నారు.

**నష్టాల్లో ఆయిల్ కంపెనీలు..**

కొన్ని వారాలుగా అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగినా.. దేశీయంగా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (IOCL, BPCL, HPCL) ఆ భారాన్ని వినియోగదారులపై వేయకుండా అవే భరించాయి. ప్రస్తుతం లీటర్ పెట్రోల్‌పై రూ.24, డీజిల్‌పై రూ.30 వరకు ఈ కంపెనీలు నష్టపోతున్నట్లుగా సమాచారం. ప్రభుత్వం తగ్గించిన ఈ ఎక్సైజ్ సుంకాన్ని ఆయిల్ కంపెనీలు తమ పాత నష్టాలను పూడ్చుకోవడానికి, ధరలు మరింత పెరగకుండా అడ్డుకోవడానికి ఉపయోగించుకునే అవకాశం ఉంది. దీంతో రీటెయిల్ అవుట్‌లెట్ల లో వినియోగదారులు కొనుగోలు చేసే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం అంతమాత్రమేనని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

## 'నా భర్త కుంజ రాము ఆశయాలే నా పయనం'.. మంత్రి సీతక్క ఎమోషనల్ కామెంట్స్

**స్టార్ త్రినేత్రం, కొత్తగూడ:**



తన భర్త కుంజ రాము ఆశయాలే నా పయనం అని మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం కొత్తగూడ మండలంలోని మోకాళ్లపల్లి గ్రామంలో కుంజ రాము 22వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మంత్రి సీతక్క తన భర్త, ఉద్యమ సహచరుడు కుంజ రాముకు కుమారుడు సూర్య, కుటుంబ సభ్యులతో కలిసి స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కుంజ రాము నా భర్త మాత్రమే కాదు. నా పోరాటానికి మార్గదర్శి. ఆదివాసీ హక్కుల కోసం ఆయన చేసిన త్యాగం మాటల్లో చెప్పలేనిది. అడవుల్లో గిరిజనుల బాధలు చూసి ఆయన నిశ్శబ్దంగా ఉండలేదు. వారి కోసం తన జీవితాన్నే అంకితం చేశారని భావోద్వేగానికి లోనయ్యారు.
జల్–జంగిల్–జమీన్ హక్కులు ఆదివాసీలకే చెందాలనే నమ్మకంతో 'మావ నాటే మావ రాజ్' అన్న నినాదం ఆయన గుండె చప్పుడు. అదే ఆశయంతో నేను కూడా ప్రజల మధ్య పని చేస్తున్నాను అని కుంజ రాము లాంటి నాయకులు భౌతికంగా దూరమైన, వారి ఆలోచనలు ఎప్పటికీ చావవు. ఆయన చూపిన మార్గంలో నడవడం, ఆదివాసీ హక్కులు కాపాడడం మన అందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. అనంతరం అస్నాల శ్రీనివాస్ రచించిన "అడవి దివిటీలు–సీతక్క కుంజ రామన్న" పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకం కుంజ రాము పోరాట గాథను భవిష్యత్తు తరాలకు చేరుస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కుంజ రాముకు ఘన నివాళులర్పించారు.



## కాంగ్రెస్ దూకుడు.. కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్‌గా సీఎం రేవంత్ రెడ్డి

**స్టార్ త్రినేత్రం, జాతీయం :**

కేరళలో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ వ్యూహాలకు పదును పెడుతోంది. త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఏఐసీసీ (AICC), ఆయా రాష్ట్రాల కోసం 40 మందితో కూడిన భారీ స్థాయిలో స్టార్ క్యాంపెయినర్ల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి కీలక బాధ్యతలు అప్పగించింది. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ (UDF) కూటమిని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా రేవంత్ రెడ్డిని స్టార్ క్యాంపెయినర్‌గా నియమించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో రేవంత్ రెడ్డి అనుసరించిన దూకుడు వ్యూహాలు, ప్రసంగ శైలి కేరళలో కూడా పార్టీకి

▶ మిగతా 2లో

## రైతులకు అలర్ట్: ఎరువుల కొరతపై కేంద్రం అధికారిక ప్రకటన

**స్టార్ త్రినేత్రం, జాతీయం :**



పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల (అమెరికా, ఇజ్రాయెల్ వర్సెస్ ఇరాన్) కారణంగా దేశంలో ఎరువుల కొరత ఏర్పడుతుందన్న ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. రైతులు ఎవరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, దేశంలో సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా శుక్రవారం లోక్‌సభలో స్పష్టం చేశారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువుల నిల్వలు దేశంలో అందుబాటులో ఉన్నాయని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. గురువారం అన్ని రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో మాట్లాడి, నిల్వల లభ్యతపై సమన్వయం చేసుకున్నట్లు తెలిపారు.

**ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ**

ముడిసరుకుల దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అదే సమయంలో ఇతర దేశాలతో దీర్ఘకాలిక దిగుమతి ఒప్పందాలు చేసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ఇటీవల హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, ఇతర మంత్రులతో కూడిన మంత్రుల బృందం సమావేశమై ఎరువుల సరఫరాపై సమీక్షించింది. తాజా పరిస్థితుల వల్ల ఉత్పత్తిపై 0.6 నుంచి 0.9 మిలియన్ టన్నుల మేర ప్రభావం పడే అవకాశం ఉండటంతో, మొరాకో వంటి దేశాల నుంచి అదనంగా దిగుమతులు చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

▶ మిగతా 2లో

## నేపాల్ ప్రధానిగా బాలేంద్ర షా ప్రమాణం.. అభినందనలు తెలిపిన ప్రధాని మోదీ

**స్టార్ త్రినేత్రం, అంతర్జాతీయం :**



పొరుగు దేశం నేపాల్‌లో నేపాల్ ప్రభుత్వం మారింది. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (RSP) అధ్యక్షుడు బాలేంద్ర షా శుక్రవారం ఆ దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. మార్చి 5న జరిగిన ప్రతినిధుల సభ ఎన్నికల్లో ఆయన పార్టీ 182 స్థానాలను గెలుచుకుని అతిపెద్ద రాజకీయ శక్తిగా అవతరించిన విషయం తెలిసిందే. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ 'శీతల్ నివాస్'లో జరిగిన ఈ కార్యక్రమంలో దేశ అధ్యక్షుడు రాంచంద్ర పౌడెల్ బాలేంద్ర షాతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ వేడుకలో రాజకీయ హంగులతో పాటు సంప్రదాయం ఉట్టిపడింది. 108 మంది బటుల శంఖనాదాలు, స్వస్తి వాచనాలు, 16 మంది బౌద్ధ భిక్షువుల అష్టమంగళ ప్రార్థనల మధ్య ఈ క్రతువు సాగింది. బాలేంద్ర షా తనదైన శైలిలో నల్లటి దుస్తులు, డార్క్ సన్ గ్లాసెస్ ధరించి ప్రమాణ స్వీకారానికి హాజరై అందరి దృష్టిని ఆకర్షించారు.

**ప్రధాని మోదీ శుభాకాంక్షలు**

బాలేంద్ర షా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే భారత ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదికగా ప్లాట్‌ఫామ్ 'X' వేదికగా అభినందనలు తెలిపారు. 'నేపాల్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన బాలేంద్ర షాకు హృదయపూర్వక అభినందనలు. భారత్–నేపాల్ మధ్య ఉన్న పురాతన స్నేహ సంబంధాలను, సహకారాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు మీతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నా' అంటూ ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్ చేశారు. .

మొదటిపేజీ తరువాయి

## కాంగ్రెస్ దూకుడు.. కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్‌గా సీఎం రేవంత్ రెడ్డి

మైలేజ్ ఇస్తాయని అధిష్టానం భావిస్తోంది. రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కూడా ప్రచార బరిలో నిలవనున్నారు.

**ఐదు రాష్ట్రాల ఎన్నికలకు హేమాహేమీలు..**

కేరళ, పుదుచ్చేరి, అస్సాం సహా ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో ప్రచారం కోసం కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను రంగంలోకి దించుతోంది. ఈ ఎన్నికల కోసం నియమించిన ప్రధాన స్టార్ క్యాంపెయినర్లుగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే (ఏఐసీసీ అధ్యక్షుడు), కేసీ వేణుగోపాల్, సిద్ధరామయ్య (కర్ణాటక సీఎం), డీకే శివకుమార్ (కర్ణాటక డిప్యూటీ సీఎం), రేవంత్ రెడ్డి (తెలంగాణ సీఎం), భట్టి విక్రమార్క (తెలంగాణ డిప్యూటీ సీఎం)లకు బాధ్యతలు అప్పగించింది. కేరళలో ఇప్పటికే రాహుల్ గాంధీ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తుండటంతో, అక్కడి గెలుపు పార్టీకి అత్యంత కీలకంగా మారింది. రేవంత్ రెడ్డి త్వరలోనే కేరళ పర్యటనకు వెళ్లి అక్కడి ఎన్నికల సభల్లో పాల్గొననున్నారు.

## రైతులకు అలర్ట్: ఎరువుల కొరతపై కేంద్రం అధికారిక ప్రకటన

**ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా**

అలాగే హోర్ముజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడటం, సహజ వాయువు (LNG) ధరలు పెరగడం వల్ల ఉత్పత్తి ఖర్చులు పెరుగుతున్నాయని 'ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (FAI)' డైరెక్టర్ జనరల్ సురేష్ కుమార్ చౌదరి తెలిపారు. ఎరువుల వినియోగంలో ప్రపంచంలో రెండో స్థానంలో, ఉత్పత్తిలో మూడో స్థానంలో ఉన్న భారత్‌కు ఈ పరిస్థితులు సవాల్‌గా మారినప్పటికీ.. ప్రభుత్వం, పరిశ్రమల మధ్య ఉన్న పటిష్ట సమన్వయంతో ఈ సమస్యను విజయవంతంగా అధిగమిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

## సిర్సపల్లి డంపింగ్ యార్డు రద్దు అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తా..

అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఈ డంపింగ్ యార్డు 2022లో మంజూరైందని గుర్తు చేశారు. అయితే, ప్రజా నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఎలాంటి పనులు చేయబోదని, స్థానిక ప్రజల ఆవేదనను, విజ్ఞప్తిని పరిశీలించి కచ్చితంగా న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, కౌన్సిలర్ వర్దినేని రవీందర్ రావు, అఖిలపక్ష కమిటీ అధ్యక్షులు పలకల ఈశ్వర్ రెడ్డి, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, అఖిలపక్ష కమిటీ నాయకులు రాజపల్లి సర్పంచ్ కట్కూరు మల్లారెడ్డి, చందుపట్ల జనార్దన్, కొలిపాక సమ్మయ్య, వేల్పుల రత్నం, హరిప్రసాద్ తదితరులు ఈ బృందంలో ఉన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుల వినూత్న చర్యలు

**స్టార్ త్రినేత్రం, సంగెం:**




రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీసులు చేపడుతున్న చర్యలు మరింత వినూత్నంగా మారుతున్నాయి. ఈ క్రమంలో సంగెం పోలీసులు ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక సైన్ బోర్డులను ప్రవేశపెట్టడం విశేషంగా నిలిచింది. ఈ బోర్డులను శుక్రవారం డీసీపీ అంకిత్ కుమార్ ఘనంగా ప్రారంభించగా, కార్యక్రమం ప్రాంతంలో ఆకర్షణగా మారింది. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలనే లక్ష్యంతో రూపొందించిన ఈ బోర్డులు వాహనదారులకు ముందస్తు హెచ్చరికలు అందిస్తూ అప్రమత్తం చేసే విధంగా రూపొందించబడినట్లు అధికారులు వెల్లడించారు.

ఈ సందర్భంగా డీసీపీ అంకిత్ కుమార్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత అనేది ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు. రోడ్లపై ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలు, మలుపులు, వేగ పరిమితులు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ సైన్ బోర్డులను ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. వాహనదారులు వీటిని గమనించి జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు.

ఈ సైన్ బోర్డులు కేవలం హెచ్చరికలకే పరిమితం కాకుండా, రహదారులపై ఉండే ప్రమాదకర పరిస్థితులను ముందుగానే గుర్తు చేస్తూ వాహనదారుల్లో అప్రమత్తత పెంచేలా రూపకల్పన చేయబడినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా వేగ నియంత్రణ అవసరమైన ప్రాంతాలు, ప్రమాదకర మలుపులు, ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాల వద్ద ఈ బోర్డులు ఎంతో ఉపయోగకరంగా మారనున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి సూచనలు పాటించడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు.

ఇదిలా ఉండగా, గతంలో సంగెం పోలీసులు ప్రవేశపెట్టిన 3డీ వాహన నమూనా కూడా మంచి స్పందన పొందిందని అధికారులు గుర్తు చేశారు. ఆ నమూనా ద్వారా వాహనదారులు ముందుగానే అప్రమత్తమై, వేగాన్ని నియంత్రిస్తూ ప్రమాదాలను నివారించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ రెండు చర్యలు కలిపి రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు.

ఈ వినూత్న చర్యలను చూసిన వాహనదారులు పోలీసులపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడే దిశగా పోలీసులు తీసుకుంటున్న ఈ చర్యలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేష్, సిఐ రాజగోపాల్, సంగెం ఎస్సై వంశీకృష్ణతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గండిచెరువులో అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

**ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి దంపతులు**



స్టార్ త్రినేత్రం, అబ్దుల్లాపూర్మెట్: గండిచెరువు గ్రామంలో శ్రీ గోదాదేవి సమేత శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణాన్ని అర్చకులు, పూజారులు కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ పూజారి యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం వారు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ..గండి చెరువు గ్రామంలో స్వయంభూగా వెలిసిన ఈ వైష్ణవ దేవాలయం ఎంతో పురాతనమైనదని, ఈ ప్రాంత ప్రజలు రంగనాయక స్వామి వారిని భక్తిశ్రద్ధలతో కొలుస్తారని పేర్కొన్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు, ప్రభుత్వ పక్షాన ఆలయాలకు పట్టువస్త్రాలు సమర్పించే కార్యక్రమం చేపట్టారన్నారు.ఈ కార్యక్రమం కింద మొట్ట మొదటిసారిగా నియోజకవర్గంలో గండిచెరువు రంగనాయక స్వామి, తొర్రూరు రంగనాయక స్వామి మరియు కవాడిపల్లి కోదండరామ స్వామి దేవాలయాల్లో పట్టువస్త్రాలు సమర్పించామన్నారు. తొర్రూరు-మునగనూరు గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో కోట్లాది రూపాయలతో వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నామని, ఇది తెలంగాణ తిరుమలగా విరాజిల్లుతుందని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కల్యాణోత్సవంలో వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్. భాస్కరాచారి, సర్పంచ్ జక్క రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ జక్క సంజీవరెడ్డి, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ గుర్రం అర్చన రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు చౌదరిమెట్టు విశ్వబ్రహ్మచారి, పూజరి బిక్షపతి గౌడ్, బండారి శ్రావణి రంగయ్య కురుమ, అనుపాటి నర్సింహ, వార్డు మెంబర్లు,పలు పార్టీల నాయకులు, అధికారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## అరైవ్ అలైవ్ లో భాగంగా వాహనదారులకు సూచనలు చేసిన రాయపర్తి ఎస్సై రాజేందర్..

- డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టు బడిన వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరిక..
- చిన్న పిల్లలకు వాహనాలు చేతికి ఇవ్వరాదని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేసిన ఎస్.ఐ.




**స్టార్ త్రినేత్రం. రాయపర్తి**

వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని రాయపర్తి ఎస్సై ముత్యం రాజేందర్ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు, విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై పలు సూచనలు చేశారు.ప్రస్తుత కాలంలో మితిమీరిన వేగం, నిర్లక్ష్యం వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది ప్రాణ రక్షణ కవచమని పేర్కొన్నారు. విద్యార్థులకు దృష్టిలో పెట్టుకొని వేగం కన్నా ప్రాణం ముఖ్యం" అని గుర్తుంచుకొని నిర్ణీత వేగ పరిమితిలోనే వాహనాలు నడపాలని సూచించారు.అదే విధంగా మద్యం సేవించి వాహనం నడప వద్దని,డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల జరిగే ప్రమాదాల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు ఫోన్ మాట్లాడటం వల్ల దృష్టి మళ్లి ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిని నివారించాలని కోరారు.ముఖ్యంగా తల్లిదండ్రులను ఉద్దేశించి చిన్న వయసు పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, ప్రతి ఒక్కరూ 'అరైవ్ అలైవ్' లక్ష్యానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానిక యువత మరియు వాహనదారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై చైతన్యం

**జక్కలుద్ది పాఠశాలలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించిన ట్రాఫిక్ సిఐ సుజాత**

**స్టార్ త్రినేత్రం.వరంగల్**





రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లాలోని జక్కలుద్ది సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో శుక్రవారం ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె. సుజాత హాజరై విద్యార్థులకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడిన ఇన్స్పెక్టర్ సుజాత, నేటి రోజుల్లో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం అత్యవసరమని పేర్కొన్నారు. వాహనం నడిపే ప్రతి వ్యక్తి చట్టబద్ధమైన డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఇది కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా భద్రతకు కూడా కీలకమని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది ప్రాణాలను రక్షించే ప్రధాన రక్షణ సాధనమని చెప్పారు. అలాగే నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ ధరించడం ద్వారా ప్రమాద సమయంలో గాయాల తీవ్రతను తగ్గించవచ్చని వివరించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అలాంటి చర్యలు ప్రాణహానికే కాకుండా చట్టపరమైన శిక్షలకు కూడా దారి తీస్తాయని హెచ్చరించారు. అదేవిధంగా మైనర్లు, లైసెన్స్ లేని వ్యక్తులు వాహనాలు నడపకూడదని, తల్లిదండ్రులు కూడా ఈ విషయంపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రతి వాహనానికి సరైన నెంబర్ ప్లేట్లు ఉండటం తప్పనిసరి అని, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించడం వల్ల జరిమానాలు మాత్రమే కాకుండా ప్రమాదాలు కూడా సంభవించే అవకాశం ఉందని చెప్పారు. విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచితే భవిష్యత్తులో బాధ్యతగల పౌరులుగా మారుతారని ఆమె అభిప్రాయపడ్డారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, నియమాలు పాటించడం ద్వారా మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఆసక్తిగా కార్యక్రమాన్ని వీక్షించి, ట్రాఫిక్ నియమాలపై పలు సందేహాలు అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై చైతన్యం కలిగించి, మంచి స్పందనను పొందింది.

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి ఇప్పపూల మమత- అజయ్ శాలువాతో ఆత్మీయ సన్మానం



స్టార్ త్రినేత్రం, వేములవాడ:శ్రీరామనవమి సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి ఇప్ప పూల మమత– అజయ్ శాలువాతో ఆత్మీయ సన్మానం చేశారు.శుక్రవారం రాజన్న ఆలయంలో కళ్యాణమూర్తులకు పట్టు వస్త్రాలను సమర్పించడానికి వేములవాడ మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ గారికి 22వ వార్డ్ కౌన్సిలర్ ఇప్పపూల మమత అజయ్ ఆత్మీయ సన్మానం చేశారు.

## శ్రీరామనవమి సందర్భంగా హరిహర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం



స్టార్ త్రినేత్రం, వేములవాడ:శ్రీరామనవమి సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి పార్కింగ్ ప్లేస్ లో భక్తులకు 200 లీటర్ల మజ్జిగ పంపిణీ కార్యక్రమం హరి హర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.శ్రీ సీతారాముల కళ్యాణం చూడడానికి వచ్చిన భక్తులకు మజ్జిగ పంచడం జరిగిందని మానవ సేవే మాధవుని సేవా గా ముందు కూ పోతున్నామని భవిష్యత్తులో మును ముందుసేవా కార ్యక్రమాలునిర ్వహిస్తామ ని హరిహర చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో హరి హర చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బండ వేణు, వైస్ చైర్మన్ చేకూర్తి నవీన్, కోశాధికారి హరీష్, సహాయ కార్యదర్శి రమేష్, ముఖ్య సలహాదారుడు అనిల్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు

## శ్రీరామనవమి సందర్భంగా వేములవాడలో వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం



స్టార్ త్రినేత్రం, వేములవాడ:రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి సందర్భంగా ఆలయ పార్కింగ్ ప్రాంగణంలోని శివార్చన వేదికపై శ్రీ సీతారాముల స్వామివారి కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదికను రంగురంగుల పూలతో, మామిడి ఆకులు, అరటి తోరణాలతో అద్భుతంగా అలంకరించారు.ఈ కార్యక్రమానికి కన్యాదాతలుగా మరింగంటి విజయసారథి–కర్ణ దంపతులు పాల్గొన్నారు.ఈ కళ్యాణోత్సవాన్ని దర్శించేందుకు రాష్ట్ర నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు తరలివచ్చినారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు శ్రీ ఆది శ్రీనివాస్ హాజరైస్వామి వారినిదర్శించుకున్నారు.వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని విధాలుగా సదుపాయాలు కల్పించారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

## డ్రంకెన్ డ్రైవ్, లైసెన్స్ కేసులపై ప్రత్యేక డ్రైవ్ –



స్టార్ త్రినేత్రం. కాజీపేట : కాజీపేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, మైనర్ డ్రైవింగ్ వంటి కేసులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. గత కొంతకాలంగా నమోదైన కేసుల్లో వాహనాలను సీజ్ చేయడంతో పాటు పలువురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ కేసులను పరిష్కరించేందుకు మార్చి 23 నుండి 28 వరకు హన్మకొండ 2వ తరగతి కోర్టులో నిర్వహించనున్న నేషనల్ లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవాలని పోలీసులు సూచించారు. ఈ లోక్ అదాలత్‌లో హాజరయ్యే వారికి తక్కువ జరిమానాతో కేసులు ముగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో ఉన్నవారు ఆధార్, వాహన పత్రాలు, లైసెన్స్ కేసుల వారు ఆధార్‌తో పాటు లైసెన్స్ దరఖాస్తు రశీదు, మైనర్ డ్రైవింగ్ కేసుల్లో ఉన్నవారు బర్త్ సర్టిఫికేట్ లేదా ఎస్ఎస్సి మెమో తీసుకురావాలని సూచించారు.

ఇక 2020 నుండి 2024 మధ్య వివిధ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలను సంబంధిత పత్రాలతో కాజీపేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి తిరిగి పొందవచ్చని తెలిపారు.

ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పి. వెంకన్న మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ముఖ్యంగా డ్రంకెన్ డ్రైవ్ మరియు మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులు ఉన్నవారు లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తక్కువ జరిమానాతో కేసులను ముగించుకోవాలని సూచించారు. అలాగే రోడ్డు భద్రత కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## నిరుపేద మహిళలకు ఆదర్శ సేవా సమితి ఆర్థిక సహాయం



స్టార్ త్రినేత్రం, పర్వతగిరి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆదర్శ సేవా సమితి శుక్రవారం నిరుపేద కుటుంబానికి చెందిన చినపాక పూలమ్మకు ఆర్థిక సహాయం చేశారు. భర్తను కోల్పోయి ఇద్దరు కుమార్తెలతో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ సొంత ఇల్లు లేకుండా తాత్కాలికంగా తాటి ఆకుల ఇల్లు వేసుకుని జీవిస్తు జీవనం సాగిస్తోందని తెలుసుకున్న ఆదర్శ సేవా సమితి సభ్యులు రూ.5 వేలను వారికి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు సేవా సమితి సభ్యులను అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేసి అందరి మన్ననలు పొందాలని ఆశించారు. కార్యక్రమంలో ముదురుకోళ్ల అశోక్, రంజిత్, వార్డు మెంబర్ రాజు, భాస్కర్ల చందన్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 279 | ఎడిటర్ : డీ.శివకృష్ణ | శనివారం, 28-3-2026 | పేజీలు: 4 | వెల: 2
WARANGAL VOL-1 ISSUE-279 Editor: D.SHIVAKRIHSNA SATURDAY, 28-3-2026 Pages: 4 Price: 2

# తొలి మ్యాచ్‌లోనే హై వోల్టేజ్..

## ఆరెంజ్ ఆర్మీ పాత లెక్కలు తీర్చుకుంటారా..?




ఐపీఎల్ అంటేనే క్రికెట్‌లో జంబో ప్యాక్. ఇక్కడ అన్నీ దొరుకుతాయ్. ఆటను ఆస్వాదించే వాళ్లకు మ్యాగ్జిమమ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది. అందుకే.. సీజన్ మొదలవడానికి ముందే హీట్ పీక్స్‌కి చేరింది. యావత్ క్రికెట్ ప్రపంచం మొత్తం.. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ కోసం కళ్లు పెద్దవి చేసుకొని ఎదురుచూస్తోంది. మార్చి 28న డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగే సూపర్ ఫైట్‌తో.. మెగా టోర్నీ గ్రాండ్‌గా మొదలుకానుంది. మరి.. ఈ సీజన్ ధమాకా ఎలా ఉండబోతోంది? టైటిల్ ఫేవరెట్లుగా ఏయే టీమ్స్ ఉన్నాయ్?

### బెంగళూరు పై..

గత సీజన్‌లో 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తొలిసారి కప్పు కొట్టి చరిత్ర సృష్టించింది. ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలో దిగుతున్న బెంగళూరుపై భారీ అంచనాలే ఉన్నాయ్. అయితే, ఐదుసార్లు ఛాంపియన్లు అయిన ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ ఈసారి కప్పును ముద్దాడాలనే కసితో ఉన్నాయ్. సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా 2016 సీన్‌ని రిపీట్ చేయాలని చూస్తోంది. గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ కూడా టైటిల్ రేసులో ఉన్నాయ్.

### మరోసారి మెరిసే అవకాశం

ఈ సీజన్‌లోనూ సిక్సర్ల సునామీతో బౌండరీల బాదుడుతో.. పరుగుల వరద పారించేందుకు అన్ని టీమ్స్‌లోనూ హిట్టర్లు రెడీగా ఉన్నారు. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్‌లో ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ జోడీ మరోసారి పవర్ ప్లేలో విధ్వంసం సృష్టించేందుకు సిద్ధమవుతోంది. గత సీజన్ విజేతగా నిలిచిన జోష్‌తో విరాట్ కోహ్లీ మరోసారి ఆరెంజ్ క్యాప్ రేసులో నిలవనున్నాడు. టీ20 నెంబర్ వన్ బ్యాటర్, వినూత్న షాట్లతో మైదానం మొత్తాన్ని కవర్ చేసే ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ కూడా మరోసారి మెరిసే అవకాశం కనిపిస్తోంది. ఇటీవల జరిగిన టీ20 వరల్డ్‌కప్‌లో దుమ్మురేపిన సంజూ శాంసన్‌పైనే ఇప్పుడు అందరి అటెన్షన్ ఉంది. ఈ లీగ్‌లోనూ అతను స్టేడియం దద్దరిల్లేలా ఆడతాడా? లేదా? అని అంతా వెయిట్ చేస్తున్నారు. స్పిన్, పేస్ అనే తేడా లేకుండా, బాదడం తప్ప మరో ఆలోచన లేకుండా కనిపించే హెన్రిచ్ క్లాసెన్.. సేమ్ ఫామ్ కంటిన్యూ చేస్తాడని ఎస్ఆర్‌హెచ్ ఫ్యాన్స్ బలంగా నమ్ముతున్నారు. ఇక.. రింకూ సింగ్ ఫినిషర్ రోల్‌లో తన పవర్ మరోసారి చూపించే ఛాన్స్ ఉంది. రిషబ్ పంత్.. ఈసారి లక్నో టీమ్ కెప్టెన్ బాధ్యతలతో పాటు బ్యాట్‌తోనూ మెరుపులు మెరిపించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### హార్దిక్ పాండ్యా సారథ్యంలో..

ఈ ఐపీఎల్ సీజన్‌లో కొన్ని ఆసక్తికరమైన మార్పులు చోటు చేసుకున్నాయి. కొన్ని టీమ్స్‌లో కెప్టెన్లు, ప్లేయర్లు మారిపోయారు. రాజస్థాన్ రాయల్స్ టీమ్.. రియాన్ పరాగ్ కెప్టెన్సీలో బరిలోకి దిగుతోంది. ఇక.. చెన్నై సూపర్ కింగ్స్ ఫ్యాన్స్.. ఈసారి మిస్టర్ కూల్ మహేంద్ర సింగ్ ధోనీ మెరుపులు చూసేందుకు ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. హార్దిక్ పాండ్యా సారథ్యంలో.. రోహిత్ శర్మ, బుమ్రా లాంటి స్టార్లతో.. ముంబై ఫుల్ స్ట్రాంగ్‌గా కనిపిస్తోంది. ఈ సీజన్.. బ్యాటర్లదే అనుకుంటే పొరపాటే అంటున్నారు. ఈసారి బౌలర్లు కూడా గట్టిగానే ప్లాన్ చేశారు. గ్రౌండ్‌లోకి దిగితే ఆటగాళ్లుగా కాకుండా వికెట్ల వేటగాళ్లుగా మారిపోనున్నారు. డెత్ ఓవర్ల కింగ్ బుమ్రా ముంబైకి వెన్నెముకలా నిలవనున్నాడు. గుజరాత్ టైటాన్స్ తరఫున రషీద్ ఖాన్ మ్యాజిక్ చేసేందుకు సిద్ధమయ్యాడు. గత సీజన్ పర్పుల్ క్యాప్ విన్నర్.. ప్రసిద్ధ్ కృష్ణ.. ఈసారి కూడా ఫేవరెట్‌గా ఉన్నాడు.

### ఐపీఎల్ ఎలా అలరించబోతోంది?

ఐపీఎల్ అంటే కేవలం ఆట మాత్రమే కాదు. అదొక ఎమోషన్. ఈ సీజన్.. క్రికెట్ ప్రపంచంలో ముందెన్నడూ లేని ఉత్కంఠను చూస్తున్నాం. ఓ వైపు పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు, మరోవైపు దేశంలో 5 అసెంబ్లీల ఎన్నికల హడావుడి నడుమ.. ఐపీఎల్ మనందరినీ ఎలా అలరించబోతోంది? కొత్త కుర్రాళ్లు ఏ రేంజ్‌లో హిట్ అవుతారు? టైటిల్ విన్నర్‌గా నిలవబోయే టీమ్ ఏది? లాంటి అంశాలన్నీ.. ఎంతో ఆసక్తి రేపుతున్నాయ్. ఎందుకంటే.. ప్రతి ఐపీఎల్ సీజన్.. కొత్త హీరోలను పుట్టిస్తుంది. ఈసారి వేలంలో ఫ్రాంచైజీలు అన్‌క్యాప్డ్ ప్లేయర్లకు కూడా కోట్లు కుమ్మరించడం చూశాక.. కుర్రాళ్లు కుమ్మేయడం ఖాయమనే వైబ్స్ కనిపిస్తున్నాయ్.

### ఈసారి కూడా అవే మెరుపులు

రాజస్థాన్ రాయల్స్‌లో ఉన్న యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ ఈసారి కూడా అవే మెరుపులు మెరిపిస్తాడా? ఫ్యూచర్ సూపర్ స్టార్ అనిపించుకుంటాడా? అన్నది ఇంట్రస్టింగ్‌గా మారింది. ఇక, చెన్నై సూపర్ కింగ్స్ కార్తీక్ శర్మ, ప్రశాంత్ వీర్ అనే కుర్రాళ్లని ఒక్కొక్కరికి 14 కోట్లకు పైగా ఖర్చు చేసి వేలంలో దక్కించుకుంది. దేశవాళీ క్రికెట్‌లో సిక్సర్ల వాన కురిపించిన కార్తీక్ శర్మ, ఆల్ రౌండర్ ప్రశాంత్ వీర్.. ఈ సీజన్ గేమ్ ఛేంజర్స్ అయ్యే అవకాశం ఉంది. ఇక డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ 5 కోట్లకు పైగా ఖర్చు చేసి మంగేష్ యాదవ్‌ని దక్కించుకుంది. ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్.. సంచలనం సృష్టించేందుకు సిద్ధమయ్యాడు.

### ఆర్సీబీ కూడా..

ఈసారి టైటిల్ పోరు చాలా డిఫరెంట్‌గా ఉండబోతోంది. ముఖ్యంగా మూడు జట్ల మధ్య గట్టి పోటీ కనిపిస్తోంది. ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఛాంపియన్‌గా నిలవాలనే కసితో ఉన్నాయ్. హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో రోహిత్ శర్మ, సూర్య కుమార్ యాదవ్ లాంటి దిగ్గజాలతో ముంబై ఫుల్ స్ట్రాంగ్‌గా ఉంది. బుమ్రా, బౌల్ట్ జోడీ ప్రత్యర్థులకు కంటిమీద కునుకు లేకుండా చేయడం ఖాయం. ఆర్సీబీ కూడా బ్యాక్ టు బ్యాక్ టైటిల్ కొట్టాలనే ఆలోచనతో ఉంది. హైదరాబాద్ ఆరెంజ్ ఆర్మీ గత సీజన్ వైఫల్యాలను అధిగమించి, విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాలని చూస్తోంది.

### టెన్షన్ల నుంచి క్రికెట్ ఫ్యాన్స్..

ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ఐపీఎల్‌పై కొంత నెగటివ్ ఇంపాక్ట్ చూపే అవకాశాలు కనిపిస్తున్నాయ్. విమాన ప్రయాణాల్లో ఆటంకాలు, ఇంధన కొరత లాంటి సమస్యలు కనిపిస్తున్నప్పటికీ, బీసీసీఐ ఈ మెగా టోర్నీని విజయవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అశాంతి, యుద్ధం తాలూకా టెన్షన్ల నుంచి క్రికెట్ ఫ్యాన్స్‌కి.. ఈ ఐపీఎల్ బిగ్ స్ట్రెస్ బస్టర్‌గా మారనుంది. సాయంత్రమైందంటే చాలు, టీవీల ముందు చేరి టెన్షన్లన్నీ మర్చిపోయి అసలు, సిసలైన క్రికెట్ మజాని ఆస్వాదించేందుకు భారతీయులంతా సిద్ధమవుతున్నారు. జియో పొలిటికల్ టెన్షన్స్, యుద్ధాలు దేశాల మధ్య గోడలు కడితే, వాటన్నింటిని దాటుకొని.. ఆటను అభిమానించే వాళ్లందరినీ క్రికెట్ ఏకం చేస్తుంది. ఈ సీజన్ కూడా అదే స్ఫూర్తితో సాగి.. కొన్ని రోజుల పాటు అందరికీ అసలైన వినోదాన్ని, అంతకుమించిన ఆనందాన్ని పంచుతుందని చెబుతున్నారు.

### రోజూ క్రికెట్ మజా..

2026 ఐపీఎల్ సీజన్ కేవలం క్రికెట్ మాత్రమే కాదు. మునుపెన్నడూ లేని ఓ మెగా ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాకేజీలా ఉండబోతోంది. అభిమానులను ఉర్రూతలూగించేందుకు సీజన్ సిద్ధమైంది. గతంలో.. 74 మ్యాచ్‌లు ఉంటే, ఈసారి మ్యాచ్‌ల సంఖ్యని 84కి పెంచారు. దాదాపు రెండు నెలల పాటు ప్రతి రోజూ క్రికెట్ మజా పక్కా అన్నమాట! ఆర్సీబీ, ఎస్ఆర్‌హెచ్ మధ్య జరిగే తొలి మ్యాచ్‌లో హై-వోల్టేజ్ గ్యారంటీ. సింపుల్‌గా చెప్పాలంటే.. యుద్ధం టెన్షన్లు, రాజకీయ వేడిని మర్చిపోయేలా సాయంత్రం వేళ అరుపులు, కేకలు, సిక్సర్ల మోతతో ఈ ఐపీఎల్ మనందరినీ.. మరో ప్రపంచంలోకి తీసుకెళ్లనుంది. కుర్ర ప్లేయర్ల మెరుపులు, సీనియర్ల సొగసైన ఆట, నరాలు తెగేంత ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లతో.. ఐపీఎల్ 2026 క్రికెట్ అభిమానులందరినీ అలరించడానికి సిద్ధమైంది. మార్చి 28న బెంగళూరులో ఆర్సీబీ వర్సెస్ ఎస్ఆర్‌హెచ్ మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో మెగా ఎంటర్‌టైన్‌మెంట్ మొదలవుతుంది.

---

# పెళ్లైన మగవారు.. పరాయి స్త్రీతో సహజీవనం చేయవచ్చు..

## హైకోర్టు సంచలనం




వివాహితుడైన పురుషుడు.. మరొక స్త్రీతో సహజీవనం చేయడం చట్టరీత్యా నేరం కాదని అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యానించింది. వయోజన మహిళతో పరస్పర అంగీకారంతో లైవ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో (సహజీవనం) ఉండటం తప్పేమి కాదని అభిప్రాయపడింది. సామాజిక నైతికత కంటే చట్టమే ప్రాధాన్యత కలిగి ఉంటుందని కోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించడం గమనార్హం.

### హైకోర్టు ఇంకా ఏం చెప్పిందంటే?

మహిళ కుటుంబం నుంచి బెదిరింపులు ఎదుర్కొంటున్న ఓ సహజీవన జంటకు సంబంధించిన కేసుపై శుక్రవారం అలహాబాద్ హైకోర్టు విచారణ జరిపింది. జస్టిస్ జె.జె. మునీర్, జస్టిస్ తరుణ్ సక్సేనాలతో కూడిన డివిజన్ బెంచ్ ఈ సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వివాహితుడైన పురుషుడు.. స్త్రీ అంగీకారంతో సహజీవనం చేస్తే అతడిపై ఎలాంటి నేరం మోపడానికి ఆస్కారం లేదని ధర్మాసనం పేర్కొంది. నైతికతను, చట్టాన్ని వేర్వేరుగా చూడాల్సిన అవసరముందని నొక్కి చెప్పింది. 'చట్టం ప్రకారం ఏదైనా చర్య నేరం కానప్పుడు కేవలం సామాజిక అభిప్రాయాలు లేదా నైతిక విలువల ఆధారంగా కోర్టులు నిర్ణయాలు తీసుకోలేవు' అని ధర్మాసనం తేల్చిచెప్పింది.

### వారి రక్షణ.. పోలీసుల బాధ్యత

ఇద్దరు వయోజనులు తమ ఇష్టానుసారం కలిసి ఉండాలని నిర్ణయించుకున్నప్పుడు వారి ప్రాథమిక హక్కులను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వం, పోలీసులపై ఉంటుందని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. మహిళ కుటుంబం నుంచి బెదిరింపులు వచ్చినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ.. ఎస్పీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని తప్పుబట్టింది. వారిద్దరికి రక్షణ కల్పించడం మీ బాధ్యత అంటూ పోలీసు అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సహజీవనం చేస్తున్న జంటకు తక్షణమే రక్షణ కల్పించాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ఏప్రిల్ 8వ తేదీకి డివిజన్ బెంచ్ వాయిదా వేసింది.

### అసలేంటీ ఈ కేసు?

షానజహాన్‌పూర్‌కు చెందిన అనామిక, నేత్రపాల్ అనే సహజీవనం చేస్తున్న జంట.. తమకు రక్షణ కల్పించాలని కోరుతూ ఇటీవల అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. మహిళ కుటుంబ సభ్యులు ఆమెను బలవంతంగా తీసుకెళ్లారని.. తనకు వివాహం జరగడంతో తప్పుడు కేసులు పెడుతున్నారని నేత్రపాల్ ధర్మాసనం ఎదుట వాపోయారు. మరోవైపు మహిళ సైతం తాను మేజర్ అని.. తన ఇష్టపూర్వకంగానే నేత్రపాల్ తో ఉంటున్నానని కోర్టుకు తెలియజేసింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న డివిజన్ బెంచ్.. ఆ జంటను అరెస్ట్ చేయకూడదని ఆదేశిస్తూ.. రక్షణ సైతం కల్పించాలని పోలీసులకు సూచించింది.

### వ్యక్తుల స్వేచ్ఛకే పెద్ద పీట..

గతంలో కూడా సుప్రీంకోర్టు సహజీవనం నేరం కాదని తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. పెళ్లికాని యువతి యువకుల్లో పెరిగిపోతున్న డేటింగ్ కల్చర్ ను ఉద్దేశిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. తాజాగా అలహాబాద్ హైకోర్టు.. ఏకంగా పెళ్లైన మగవారు సహజీవనం చేయడం చట్ట విరుద్ధం కాదని తీర్పు ఇవ్వడం ప్రస్తుతం తీవ్ర చర్చకు దారితీసింది. మనుషుల వ్యక్తిగత నిర్ణయాలకు సంబంధించి సామాజిక కట్టుబాట్ల కంటే రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛకే ఎక్కువ విలువ ఉంటుందని ఈ తీర్పు మరోసారి చాటిచెప్పింది.

---




# కొత్త పార్టీపై కవిత కీలక ప్రకటన.. ముహూర్తం ఖరారు.. ఎప్పుడంటే?

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త ప్రాంతీయ పార్టీ ఏర్పాటుకు ముహూర్తం ఖరారు చేశారు. వచ్చే ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు శుభ ముహూర్తాన పార్టీ ప్రకటన, జెండా ఆవిష్కరణ ఉంటుందని ఆమె వెల్లడించారు. మేడ్చల్ జిల్లాలోని మునిరాబాద్, పూడూరు వేదికగా భారీ బహిరంగ సభ నిర్వహించి, ఈ సభ ద్వారా తన రాజకీయ భవిష్యత్తు కార్యాచరణను ప్రజల ముందుకు తీసుకురానున్నారు.

రాజకీయాలు అంటే 'రాకెట్ సైన్స్' ఏమీ కాదని, ఒకవేళ అది రాకెట్ సైన్స్ అయినా సరే, మన జీవితాలను ప్రభావితం చేసే అత్యంత కీలకమైన అంశం కాబట్టి దానిని అర్థం చేసుకోవడం, అందులో భాగస్వాములు కావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పిలుపునిచ్చారు. "రాజకీయాలకు దూరంగా ఉండకండి.. వ్యవస్థను మార్చాలంటే వ్యవస్థ లోపలికి రావాలి" అని కవిత తెలంగాణ యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఎవరో పెట్టిన సిస్టమ్‌ను కేవలం సరిదిద్దడం కాకుండా, సంపూర్ణంగా రూపాంతరం చెందించడమే జాగృతి పార్టీ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రం వచ్చి 12 ఏళ్లు గడుస్తున్నా మౌలిక సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని, రైతుల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం కూడా పోరాడాల్సిన దుస్థితి నెలకొందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

కేవలం పాలకులను ప్రశంసించడమే కాదు, పనులు జరిగే వరకు పట్టుబట్టి ప్రశ్నించే చైతన్యాన్ని ప్రజల్లో నింపుతామని కవిత పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టకుండా చూడటం, మైనారిటీల సంక్షేమం కోసం కేటాయించిన నిధులను సద్వినియోగం చేయడంపై పార్టీ దృష్టి పెడుతుంది. కొందరు నేతలు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, లేనప్పుడు మరోలా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నారని, అటువంటి "మతి మరుపు" రాజకీయాలకు చరమగీతం పాడుతామని హెచ్చరించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు పురుషుల నాయకత్వంలోని పార్టీలను ప్రజలు చూశారని, ఇకపై ఒక ఆడబిడ్డ నడిపే పార్టీ అసలైన మార్పును చూపిస్తుందని కవిత ధీమా వ్యక్తం చేశారు. "నిజమైన మార్పు ఏంటో చూపిస్తాం" అని పేర్కొంటూ, మహిళా సాధికారతకు ఈ పార్టీ ప్రాధాన్యతనిస్తుందని సూచించారు. పార్టీ ప్రకటనకు ముందు వారణాసి వెళ్లి గంగా స్నానం చేసి, రాముని ఆశీర్వాదంతో ప్రచారాన్ని ప్రారంభిస్తామని ఆమె తెలిపారు.

కొత్త పార్టీ నిర్మాణం కోసం ప్రజల నుంచి సలహాలు, సూచనలను కవిత ఆహ్వానించారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక వాట్సాప్ నంబర్, ఈమెయిల్ ఐడిని అందుబాటులోకి తీసుకురానున్నారు. రాబోయే 28 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి తెలంగాణ ఉద్యమకారులు, యువత, మహిళలు, మేధావులు, కవులు మరియు పాత్రికేయులతో విస్తృతంగా చర్చించనున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో రావాల్సిన మార్పులపై ప్రతి ఒక్కరి అభిప్రాయం తీసుకున్న తర్వాతే పూర్తిస్థాయి ప్రణాళికను సిద్ధం చేయనున్నారు.

తన పార్టీ ఎవరికీ 'బీ-టీమ్' కాదని, తెలంగాణ ఆత్మగౌరవమే అజెండాగా ఈ ప్రాంతీయ పార్టీ పనిచేస్తుందని కవిత స్పష్టం చేశారు. ప్రస్తుతం తెలంగాణలో ప్రాంతీయ పార్టీల ప్రాభవం తగ్గి, జాతీయ పార్టీలకు దారి మల్లుతున్న తరుణంలో.. తెలంగాణ ప్రజల ఇంటి పార్టీగా 'జాగృతి' నిలబడుతుందని ఆమె పేర్కొన్నారు. పాత, కొత్త రక్తం కలయికతో పార్టీ శక్తివంతంగా పనిచేస్తుందని, బీఆర్ఎస్ క్యాడర్ మొత్తం తమతోనే ఉందని ఆమె వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో తెలంగాణలో నంబర్ వన్ పార్టీగా అవతరిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మన పెద్ది పహిల్వాన్ వచ్చేశాడు


## గ్లోబల్ స్టార్ బర్త్ డే ట్రీట్ అదిరిపోయిందిగా...

మెగా ఫ్యాన్స్ అవెయిటెడ్ మూమెంట్ వచ్చేసింది. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ బర్త్ డే స్పెషల్‌గా పెద్ది నుంచి హీరో రోల్ ఇంట్రడ్యూస్ చేస్తూ వీడియో రిలీజ్ చేశారు మేకర్స్. మాస్, రగ్డ్ లుక్‌లో చరణ్ అదరగొట్టారు.

టైటిల్ గ్లింప్స్‌లో సిగ్నేచర్ షాట్ వెరీ స్పెషల్. ఒక్క షాట్‌తోనే భారీ హైప్ క్రియేట్ చేశారు చరణ్. ఇప్పుడు తాజా వీడియోలో అంతకు మించిన మాస్ లుక్, డైలాగ్స్ పదింతలు హైప్ పెంచేశాయి. కుస్తీ పోటీదారుడిగా కండలు తిరిగిన దేహంతో పెద్ది పహిల్వాన్‌గా చరణ్ అదరగొట్టారు. 'కుస్తీ అంటే బంతితో బ్యాటుకు ఎదురెళ్లే ఆట కాదురా... ప్రాణంతో చావుకు ఎదురెళ్లే ఆట' అనే డైలాగ్‌తో ప్రారంభమైన వీడియో... చరణ్ కుస్తీ కసరత్తులు, యాక్షన్ సీక్వెన్స్‌తో గూస్ బంప్స్ తెప్పిస్తోంది. ఇప్పటికే రిలీజ్ చేసిన గ్లింప్స్, చికిరి చికిరి, రయ్ రయ్ రా రా సాంగ్స్ ట్రెండ్ అవుతున్నాయి. సోషల్ మీడియాలో మిలియన్ల కొద్దీ వ్యూస్, లక్షల్లో ఆ సాంగ్స్ స్టెప్పులు రీ క్రియేట్ చేశారు. ఇక నెట్టింట టీజర్ మేనియా మొదలు కానుంది. చరణ్ లుక్స్‌కు అభిమానులతో పాటు మూవీ లవర్స్ ఫిదా అవుతున్నారు.

ఉప్పెన ఫేం బుచ్చిబాబు సానా దర్శకత్వం వహించిన ఈ మూవీలో చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించారు. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, మీర్జాపూర్ ఫేం దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ, జగపతి బాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఉత్తరాంధ్ర గ్రామీణ స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్‌గా సినిమా తెరకెక్కినట్లు టీజర్‌ను బట్టి తెలుస్తోంది. ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందించారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు.

ఈ నెల 27నే సినిమా రిలీజ్ కావాల్సి ఉండగా... అనుకోని కారణాలతో వాయిదా పడింది. షూటింగ్ కాస్త పెండింగ్ ఉండగా అది కంప్లీట్ చేస్తున్నారు. ఏప్రిల్ 30న పాన్ ఇండియా స్థాయిలో పెద్ది ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో రిలీజ్ కానుంది.




# అడగ్గానే రామ్ చరణ్ రూ.40లక్షలు ఇచ్చారు: జానీ మాస్టర్




రామ్ చరణ్ ఎంతోమందికి సాయం చేశారని ఆయన ఇండస్ట్రీలో ఉండటం అందరి అదృష్టమని కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అన్నారు. రామ్ చరణ్ పుట్టినరోజు ఈవెంట్‌లో ఆయన మాట్లాడుతూ.. చరణ్‌ది గొప్ప మనసని కొనియాడారు.

"డాన్సర్లు ఎంత కష్టపడతారో చరణ్ అన్నకు తెలుసు. వాళ్లకు ఇన్సూరెన్స్ చేయిస్తా అని గతేడాది చెప్పారు. దానికోసం అడగ్గానే 40 లక్షలు ఇచ్చారు. ఇది డబ్బు మాత్రమే కాదు.. 600 కుటుంబాల ఆరోగ్యం. కనీసం 2000 మందికి ఇన్సూరెన్స్ చేయించారు. ఈ రోజుల్లో 40 రూపాయలు ఇవ్వడమే కష్టం. అలాంటిది ఇన్ని లక్షలు అడగ్గానే ఇవ్వడం ఆయన గొప్పతనం. డాన్సర్స్ యూనియన్ మొత్తం ఆయనకు రుణపడి ఉంటుంది. అలాంటి గొప్ప వ్యక్తిని మాకు అందించిన చిరంజీవిని ఎప్పటికీ మర్చిపోలేం. టాలెంట్ ఉన్న వాళ్లను ప్రోత్సహించడంలో చరణ్ ముందుంటారు. ఎవరికి ఆపద వచ్చినా ఆదుకుంటారు. దానికి నేనే ఉదాహరణ" అని జానీ మాస్టర్ చెప్పారు.


# నిన్ను చూస్తుంటే గర్వంగా ఉంది: చరణ్‌కు విషెస్ చెప్పిన చిరు

రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో సందడి నెలకొంది. 'పెద్ది' గ్లింప్స్‌తో అభిమానుల్లో జోష్ పెంచారు. కుమారుడికి శుభాకాంక్షలు చెబుతూ చిరంజీవి అరుదైన ఫొటోలను పంచుకున్నారు. "చరణ్ బాబు.. చిన్నప్పుడు నా వేలు పట్టుకొని నడిచిన స్థాయి నుంచి.. ఈరోజు ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచే స్థాయికి ఎదగడం చూస్తుంటే నాకు చాలా గర్వంగా ఉంది. సినిమా,



వ్యక్తిగత జీవితాన్ని నువ్వు బ్యాలెన్స్ చేసే విధానం, కుటుంబంపై నీకున్న బాధ్యత, దేవుడిపై భక్తి, క్రమశిక్షణ, నీ విలువలు.. వీటిని చూసిన ప్రతిసారీ నీపై నా ప్రేమ, గౌరవం మరింత పెరుగుతూనే ఉన్నాయి. ఆ దేవుడి ఆశీస్సులు, అభిమానుల ప్రేమాభిమానాలు నిన్ను ఉన్నత శిఖరాలకు నడిపించాలని కోరుకుంటున్నాను" అని చిరంజీవి తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

# అనుబంధాల 'ఇరుముడి'



భక్తి, బంధాలు, భావోద్వేగాలతోపాటు... రవితేజ శైలి మాస్ అంశాల మేళవింపుతోనూ రూపొందుతున్న చిత్రమే 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రియ భవానీ శంకర్ కథానాయిక. బేబి నక్షత్ర, సాయికుమార్ ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే యాభై శాతం చిత్రీకరణని పూర్తి చేసుకుందీ చిత్రం. ప్రస్తుతం హైదరాబాద్‌లో యాక్షన్ సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. స్టంట్ కొరియోగ్రాఫర్లు అనల్ అరసు, రియల్ సతీశ్ నేతృత్వంలో విభిన్నమైన పోరాట ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని చిత్రబృందం గురువారం ఓ ప్రత్యేకమైన పోస్టర్‌ని విడుదల చేసింది. తండ్రీకూతుళ్లుగా నటిస్తున్న రవితేజ, బేబి నక్షత్ర ఆ పోస్టర్‌లో కనిపిస్తున్నారు.

# నా జీవితానికి పురుషుడు అవసరం లేదు: మలైకా అరోరా

తనపై సోషల్ మీడియాలో ప్రచారం అవుతోన్న డేటింగ్ రూమర్స్‌పై నటి మలైకా అరోరా అసహనం వ్యక్తంచేశారు. ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ ఇలాంటి వార్తలు తనకు మొదట్లో చిరాకు తెప్పించేవని అన్నారు. కానీ ఇప్పుడు వాటిని చూసి తాను, తన కుమారుడు అర్హాన్ ఖాన్ నవ్వుకుంటున్నామని తెలిపారు. ఎవరితో కనిపించినా వెంటనే వారితో డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు రాయడం ఒక అలవాటుగా మారిందని ఆమె మండిపడ్డారు.

"చిన్నప్పటి నుంచి నేను ఎవరిపైనా ఆధారపడి బతకలేదు. స్వయంకృషితో ఎదిగిన మహిళని. నా ఉనికిని చాటుకోవడానికి, నన్ను నేను పరిపూర్ణం చేసుకోవడానికి పురుషుడు అవసరం లేదు. తోడు ఉండడం అవసరమే.. కానీ, నేను ప్రస్తుతం దానికోసం వెతకడం లేదు. ఒకవేళ భవిష్యత్తులో ఎవరితోనైనా ఉండాలనిపిస్తే అది పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయం కాబట్టి ఎవరితో చెప్పాల్సిన అవసరం లేదు' అని స్పష్టంచేశారు.

ప్రస్తుతం తన కెరీర్, వ్యాపారంపై పూర్తిగా దృష్టిపెట్టినట్లు మలైకా తెలిపారు. 2017లో అర్బాజ్ ఖాన్‌తో ఆమె విడాకులు తీసుకున్నారు. కొంతకాలం అర్జున్ కపూర్‌తో డేటింగ్‌లో ఉన్న మలైకా 2024లో ఆయనతోనూ విడిపోయారు. నటుడు సోరబ్ బేడీతో ఆమె ఇటీవల ఓ పార్టీలో కనిపించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS,6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL,TELANGANA-506001.PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313.
EDITOR: DHEEKONA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 9948206302, email: startrinethram28@gmail.com